- ◆భావోద్వేగంతో సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్‌కు వీడ్కోలు..
- ◆మీ లాంటి వారి సేవలు దేశానికి అవసరం..
- ◆సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ ఆత్మీయ వీడ్కోలు సభలో టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- ◆మీరంతా నా కుటుంబ సభ్యులే...నవీన్ మిట్టల్
- ◆రోబో అడ్మినిస్ట్రేటర్ మాత్రమే కాదు..ఆయన ఎన్ సైక్లో పీడియా...కొనియాడిన జడ్జి నర్సిరెడ్డి
- ◆నాకు తండ్రి సమానులు...మిట్టల్ తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సిసిఎల్ ఏ సెక్రెటరీ మకరంద్
- ◆నవీన్ మిట్టల్‌కు కనీవినీ ఎరుగని రీతిలో సన్మానం, వీడ్కోలు
- ◆వేదమంత్రాలు, మేళతాళాలతో ఘన స్వాగతం
- ◆మిట్టల్ సార్ వీడ్కోలు సభలో పలువురి కన్నీటి పర్యంతం

హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్




## సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ నవీన్‌మిట్టల్

# విలువైన గ్రంథం

## ఆత్మీయ వీడ్కోలు సభలో టిజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

నవీన్ మిట్టల్ సార్ ఒక విలువైన సిద్ధాంత గ్రంథం.. విలువలకు ఆయన నిలువెత్తు రూపం.. క్రమశిక్షణ ఆయన వ్యూహం.. నాణ్యమైన పని ఆయన పనితీరు..అనుభవం ఆయన పాఠశాల.. ఆధునికుల్లో ఆధునికుడు..రెవెన్యూ సంస్కరణలకు ఆద్యుడు..పదవులకు అలంకారంలా భాసిల్లిన ప్రతిభాశాలి..నిగర్వి, నిష్కామయోగి..ఆయన ఆలోచనలతోనే పతనమైన రెవెన్యూ వ్యవస్థకు పూర్వ వైభవం సంతరించుకుంది..అని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌ను ఉద్దేశించి కొనియాడారు. సీసీఎల్ఏ నుండి విద్యుత్ శాఖకు బదిలీపై వెళుతున్న నవీన్ మిట్టల్‌కు టీజీఈజేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సారథ్యంలో సోమవారం సీసీఎల్ఏ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. గతంలో మరే ఉద్యోగికీ కూడా జరగని విధంగా అనేక మంది రెవెన్యూ, సీసీఎల్ఏ ఉద్యోగుల భావోద్వేగం నడుమ నవీన్ మిట్టల్‌కు తమ శాఖ నుండి విద్యుత్ శాఖకు సగర్వంగా సాగనంపారు. ఇందుకు సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి...సీనియర్ ఐఏఎస్ అధికారి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఇటీవల ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా విద్యుత్ శాఖకు బదిలీ అయిన సందర్భంగా సీసీఎల్ఏ కార్యాలయంలో వీడ్కోలు సభను వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ...రెవెన్యూ చరిత్రను ఒక గాడిన పెట్టి పతనమైన రెవెన్యూ వ్యవస్థకు ఒక రూపం తెచ్చి, అనేక రకాలుగా శాఖను బలోపేతం చేయడమే కాకుండా పూర్వవైభవాన్ని మించేలా రూపుదిద్దిన నవీన్ మిట్టల్ సార్ రెవెన్యూ చరిత్రలో నిలిచిపోతారని కీర్తించారు. ఆడంబరాలకు దూరంగా ఉండే మిట్టల్ సార్ తన వీడ్కోలు సభకు ఒప్పుకున్నందుకు యావత్ తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. 25 సంవత్సరాలుగా ఎందరో ఐఏఎస్ అధికారులను తాను చూసినా నవీన్ మిట్టల్ సార్ లాంటి ప్రత్యేకంగా చూశానని లచ్చిరెడ్డి గుర్తుచేసు కున్నారు. తాను నాలుగున్నర సంవత్సరాల పాటు విధులకు దూరమై తిరిగి బాధ్యతల్లోకి వచ్చే సమయంలో మిట్టల్ సార్‌కు ఒక లేఖ ఇస్తే సీసీఎల్ఏ లోనే తీసుకుని తనకు కీలకమైన బాధ్యతలు అప్పగించారని గుర్తు చేసుకున్నారు. మీలాంటి అధికారులు సర్వీస్‌లోనే ఉండాలని తనని ప్రోత్సహించారని అన్నారు. రవెన్యూ చరిత్రలో భూ భారతి చట్టం ముసాయిదా, పోర్టల్, చట్టం రూపకల్పనలోనూ, రెవెన్యూ ఉద్యోగులకు విలువ పెంచడంలోనూ, వీఆర్వో, వీ ఆర్యేలను తిరిగి రెవెన్యూలోకి తీసుకురావడంలో నవీన్ మిట్టల్ సార్ చొరవ చాలా ఉందని లచ్చిరెడ్డి అన్నారు. అందుకే నవీన్ మిట్టల్ సార్ లాంటి వారి సేవలు యావత్ భారతదేశానికి అవసరం ఉందని లచ్చిరెడ్డి సగర్వంగా ప్రకటించారు. చాలా మంది అనుకున్నట్టుగా సీఎస్ కావడం కాదనీ, కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించే అవకాశాలు రావచ్చని లచ్చిరెడ్డి జోస్యం చెప్పారు.




**మీరంతా నా కుటుంబ సభ్యులే...నవీన్ మిట్టల్, సీనియర్ ఐఏఎస్ అధికారి**

రెవెన్యూ శాఖలో గత రెండేండ్లుగా సాధించిన ఎన్నో విజయాలు రెవెన్యూ ఉద్యోగులతో కలిసి తాను సాధించిన విజయాలు అనీ, ప్రభుత్వ సహకారంతో ఒక టీమ్ వర్క్‌గా సాధించుకున్నామని, ఇది నా ఒక్కడి విజయం కాదని వందలాది మంది రెవెన్యూ ఉద్యోగుల కరతాళ ధ్వనుల నడుమ నవీన్ మిట్టల్ ప్రకటించారు. నేను సీసీఎల్ఏ నుండి బదిలీ కావడంతో ఈ రోజు వీడ్కోలు సభలో అనేక మంది భావోద్వేగానికి లోనయ్యారనీ, మీ అందరిమాదిరే తాను కూడా లోలోన అదే విధంగా తీవ్రమైన భావోద్వేగాన్ని అనుభవిస్తున్నానని దు:ఖ స్వరంతో అన్నారు. తాను సీసీఎల్ఏగా బాధ్యతల్లోకి రాగానే కోకొల్లలుగా రెవెన్యూ శాఖనుండి దరఖాస్తులు వచ్చి పడ్డాయని రెవెన్యూలో ఇన్ని సమస్యలున్నాయని ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సాధ్యమైనంత మేరకు సమస్యలు పరిష్కరించడానికి మీ అందరితో కలిసి పనిచేశాననని అన్నారు. ఒకే రోజున 2వేల అప్లికేషన్లు పరిష్కరించామంటే అంతటి ఘనత మీ అందరి ప్రోత్సాహం, సహకారం వల్లనే సాధ్యమైందని నవీన్ మిట్టల్ అన్నారు. తాను ఎక్కడ ఉన్నా రెవెన్యూ ఉద్యోగులతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోననీ, ఎవరికి ఎలాంటి సహకారం కావాలన్నా తాను సిద్ధంగా ఉంటానని నవీన్ మిట్టల్ అన్నారు. సీసీఎల్ఏగా తాను పనిచేసినంతకాలం తనతో కలిపి పనిచేసిన ప్రతీ ఒక్కరితో ఉన్న అనుబంధాలను మరిచిపోనని మిట్టల్ తన సందేశంలో అన్నారు.

**మిట్టల్ సార్ వీడ్కోలు సభలో పలువురి కన్నీటి పర్యంతం**

సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ఆత్మీయ వీడ్కోలు సభలో పలువురు ఉద్యోగులు మిట్టల్‌తో ఉన్న అనుబంధాన్ని రెవెన్యూశాఖకు ఆయన చేసిన విలువైన సేవలను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడిన మిట్టల్ సార్ బదిలీపై వెళ్లడం బాధగా ఉందని వారు అన్నారు. పలువురు ఉద్యోగులు తమ సందేశం వినిపించే సందర్భంగా మిట్టల్ సార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. న్యాయమూర్తి నర్సిరెడ్డి మాట్లాడుతూ..నవీన్ సార్ రోబో అడ్మినిస్ట్రేటర్ మాత్రమే కాదనీ ఆయన ఒక ఎన్‌సైక్లోపీడియా అని కీర్తించారు. ఇలాంటి అధికారులు రాష్ట్రానికి, దేశానికి చాలా అవసరం అని జడ్జి నర్సిరెడ్డి అన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని జడ్జి నర్సిరెడ్డి తెలిపారు. 1996వ బ్యాచ్‌లో ఐఏఎస్ అధికారుల్లో అత్యంత యంగ్ ఐఏఎస్‌గా నవీన్ మిట్టల్ సార్ రికార్డు నెలకొల్పారనీ, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించి ఐఏఎస్ వృత్తికే వన్నె తెచ్చారని ఆయన అన్నారు. సీసీఎల్ఏ కార్యదర్శి మకరంద్ మాట్లాడుతూ...తాను పుట్టక ముందే మిట్టల్ సార్ ఐఏఎస్‌గా ఉన్నారనీ, తన తండ్రి సమానుల్కైన సార్‌తో కలిసి పనిచేసి ఎంతో నేర్చుకున్నాననీ, ఉద్యోగులు, బాధ్యతలు, విధులు, చట్టాలు అనేక అంశాల గురించి మిట్టల్ సార్ దగ్గర నేర్చుకున్నానని మకరంద్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ..తనకు దేవుడు అంటే నమ్మకం లేదనీ, మిట్టల్ సార్‌ను చూసిన తరువాత దేవుడంటే ఇలా ఉంటాడా అని తెలిసిందనీ, అందుకే తన సెల్ ఫోన్‌లో ఎన్ఎం సార్ మై గాడ్ అని ఉంటుందని గుర్తుచేసుకున్నారు. టీజీటీఏ నేతలు రాములు, రమేష్ పాక, రాధ, పూల్ సింగ్ చౌహాన్, టీజీఆర్ఎస్ఏ నేత వి.బిక్షం, సీసీఎల్ఏ యూనిట్ బాధ్యులు రాంబాబు, న్యాయమూర్తి నర్సిరెడ్డి, జీపీఓల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మీనరసింహులు, సీసీఎల్ఏ అడ్మినిస్ట్రేటర్ కే. సబిత, ఉద్యోగులు మాలతి, రాంబాబు, మిట్టల్ పీఏ మాధవరావు తదితరులు తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని మిట్టల్‌సార్ ఒక విలువైన సిద్ధాంత గ్రంథం అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయాకుడు జంగన్న బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. ముఖ్యంగా మిట్టల్ సార్ గురించి ఉద్యోగులు భావోద్వేగానికి గురైన అంశాన్ని బట్టి అప్పటికప్పుడు రాసి పాడిన 'ఇదే ఏమి చిత్రం సారూ..ఇంత బాధ ఏంది మిట్టల్ సారూ..ఏడ చూడలేదు..ఏనాడూ వినలేదు..ఇంత ప్రేమ మేము కనలేదు..పుణ్యాత్ముడావయ్య మిట్టల్ సారూ.. అనే పాట సభలో అనేక మందిని కన్నీటిని తెప్పించింది. అనంతరం రెవెన్యూ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో అనేక మంది రెవెన్యూ ఉద్యోగులు మిట్టల్‌ను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ అభినందన సభ అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో మిట్టల్‌ను ఊరేగింపుగా సీసీఎల్ఏ కార్యాలయం ప్రాంగణంలో తిప్పుడూ తన వాహనం వద్దకు తోడ్కొని ఇంటికి సగర్వంగా సాగనంపారు.